సాక్షి అనకాపల్లి

శనివారం । 9 । మార్చి । 2024

శివోహం... భక్త జన సందోహం

మంత్రోచ్ఛారణలతో ఆలయాలు మార్మోగాయి....శివ పంచాక్షరి జపంతో భక్తులు పరవశించిపోయారు...రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలతో అడుగడుగునా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలో శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, ఆ జలంతో అభిషేకాలు నిర్వహించారు. పంచదార్ల, కల్యాణపులోవ, బలిఘట్టం, ధారమఠం, చోడవరం తదితర పలు ప్రసిద్ధ శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

8లో



రావికమతం మండలం కల్యాణపులోవలో భక్తుల పుణ్య స్నానాలు



బలిఘట్టం వద్ద బ్రహ్మలింగేశ్వరుడి సన్నిధిలో పూజలు చేస్తున్న భక్తులు



రూపాయికే టిడ్కో ఇల్లు

నర్సీపట్నం మున్సిపాలిటీలోని బలిఘట్టంలో శుక్రవారం అట్టహాసంగా టిడ్కో గృహాల ప్రవేశాలు జరిగాయి. తొలుత ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. ఇక్కడ 384 గృహాలకుగాను 352 మందికి ఫ్లాట్‌లు కేటాయించారు.

8లో

ప్రతి రోజూ పండగే

- మాడుగుల నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- విద్య, వైద్య రంగాలలో గణనీయమైన మార్పులు
- జల్‌జీవన్‌మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు
- రైతన్నకు భరోసా.. వ్యవసాయ రంగానికి పెద్దపీట
- సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం
- ఐదేళ్లలో రూ.4,068 కోట్లతో కనీవినీ ఎరుగని సంక్షేమాభివృద్ధి



వస్తూవస్తూనే సచివాలయ వ్యవస్థను తెచ్చారు. గ్రామీణ రంగాన్ని బలోపేతం చేశారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ చూడని సంక్షేమం.. అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సాధ్యమైంది. మాడుగుల నియోజకవర్గం రూపురేఖలే మారిపోయాయి. సుసంపన్న ప్రాంతంగా అవతరించింది. ఈ ప్రాంత ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు డిప్యూటీ సీఎం కావడం.. స్వయానా పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉండడంతో గ్రామ గ్రామాన ప్రగతి వెలుగులు నిండేలా శ్రద్ధ తీసుకున్నారు. స్వగ్రామం తారువలోనే తన క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు ప్రగతి పనులను పర్యవేక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఏకంగా రూ.4,068 కోట్లతో కనీవినీ ఎరుగని సంక్షేమాభివృద్ధిని సాధించారు.

మాడుగుల: రోజుకో మండలంలో ప్రారంభోత్సవం.. రోజుకో గ్రామంలో సంబరం.. రహదారులు, ఆస్పత్రులు, మంచినీటి పథకాలు, ఆర్బీకేలు, సచివాలయాలకు కొత్త భవనాలు.. ఇలా ఒక్కటొక్కటిగా అందుబాటులోకి వచ్చి బతుకులు బాగుపడితే ప్రతి రోజూ పండగే కదా! గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న మాడుగుల నేడు అన్నింటిలో మిన్నగా ఎదిగింది. గత 40 ఏళ్లలో సాధించలేనిది ఐదేళ్లలో సాధ్యమైంది. ఈ ప్రాంత ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాత కోసం చేపట్టిన పథకాలు వారి జీవితాలను బాగుచేశాయి. తండ్రి వైఎస్సార్ హయాంలో పూర్తయిన పెద్దేరు జలాశయానికి ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి రూ.84 కోట్లు కేటాయించి ఆధునికీకరణ చేపడుతున్నారు. విద్య, వైద్య రంగాల్లో అపూర్వమైన మార్పులు, ఇంటింటికీ కుళాయిలు, రెండు గ్రామాలు కలపడానికి కింతలిలో గొర్రిగెడ్డపై వంతెన నిర్మాణం, మాడుగుల వెళ్లడానికి తాచేరుపై వంతెన నిర్మాణం .. ఇలా ఎన్నో పనులు ప్రజల జీవన విధానంలో మంచి మార్పు తీసుకొచ్చాయి. 106 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

106 గిరి గ్రామాలకు బంగారు బాటలు



చీడికాడ నుంచి కొండవీధికి వేసిన పక్కా రోడ్డు



దేవరాపల్లి మండలం గరిసింగి నుంచి దొర్ర చెరువు గిరి గ్రామానికి వేసిన పక్కా రోడ్డు

ఒకప్పుడు కాలినడకన వెళ్లడం కూడా సాధ్యం కాని కొండ దారులను బంగారు బాటలుగా అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో 106 గిరి గ్రామాలకు చక్కని రహదారులు అందుబాటులోకి వచ్చాయి. దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీలో బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలు కొండలపై ఉన్నాయి. వీటికి రెండు కోట్లతో రోడ్లు వేశారు. తామరబ్బ పంచాయతీలో చినసోంపురం, గరిసింగి పంచాయతీలో చినగంగవరం, చింతలపాలెం, గరిసింగి, డొర్ర చెరువు, తాటిపూడి తదితర గిరి గ్రామాల కొండబాటలన్నీ పక్కా రోడ్లుగా మార్పు చెందాయి. మాడుగుల మండలంలో గదబూరు, డి.గొటివాడ నుంచి రాజంపేట, పనుకు గదబూరు, శరభన్నపాలెం, చినసారాడ, కింతలి నుంచి లోవ వీరనారాయణం మీదుగా గొర్రిగెడ్డ, వయా కొండ వీధి, రావిపాలెం నుంచి సిరిపురం, బిల్లలపాలెం, ద్వార కానగర్, లక్ష్మీంపేట, చీడికాడ మండలంలో గుడివాడ నుంచి చెరుకుబిల్లి, జాజులపాలెం, వీరభద్రపేట నుంచి గొప్పూరు వరకు చక్కని రహదారులు వేశారు. రూ.60 కోట్లతో 520 సీసీ రోడ్లను పూర్తి చేశారు. కింతలి, వల్లాపురం గ్రామాల మధ్య గొర్రిగెడ్డపై రూ.40 లక్షలతో వంతెన నిర్మాణం జరిగింది. ఎల్.క్రిష్టాపురం నుంచి కామకూటం గిరిజన గ్రామానికి రూ.3.40 కోట్లతో సర్వాంగ సుందరంగా రోడ్డు నిర్మించారు. ఇక మైదాన ప్రాంతాలకు వస్తే మాడుగుల మండలం డి.గొటివాడ నుంచి సాగరం కాలనీ మీదుగా మాడుగుల వరకు రోడ్డుతోపాటు తాచేరుపై వంతెన నిర్మాణ పనులు రూ.7.40 కోట్లతో చకచకా జరుగుతున్నాయి.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



మాడుగుల అగ్రి ల్యాబ్‌లో పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాడుగులలో రూ.80 లక్షలతో ఆధునాతన వసతులతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. విత్తన నాణ్యతను పరీక్షించడం, పశువులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడానికి ఈ ల్యాబ్ ఉపయోగపడుతోంది. పశువులకు 15 నిమిషాల్లో వ్యాధి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. విత్తన శాంపిల్స్‌ను 20 నిమిషాల్లో పరీక్షించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ఇంతవరకు 4,209 విత్తన పరీక్షలు నిర్వహించారు. నాలుగు వేల ఆవులకు, ఏడు వేల గేదెలకు, 15 వేల మేకలు, గొర్రెలకు పరీక్షలు జరిపారు.

ఐదేళ్లలో అందిన సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
అమ్మఒడి	24,845	రూ.16,45,89,418
వైఎస్సార్ పింఛన్ కానుక	46,878	రూ.36,84,84,504
వైఎస్సార్ చేయూత	21,447	రూ.43,37,42,139
వైఎస్సార్ ఆసరా	47,724	రూ.80,16,52, 250
వైఎస్సార్ రైతు భరోసా	45,138	రూ.17,48,78,119
హౌసింగ్ నేరుగా చెల్లింపు	4,942	రూ.45,74,61,373
సున్నా వడ్డీ	59,718	రూ.64,05,20,857
ఉచిత పంటల బీమా	530	రూ.4,00839
వైఎస్సార్ కాపునేస్తం	279	రూ.95,77,200
జగనన్న విద్యా దీవెన	2,174	రూ.34,51,88,394
జగనన్న వసతి దీవెన	11,991	రూ.14,29,69,772
వైఎస్సార్ నేతన్న నేస్తం	100	రూ.24,00000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	436	రూ.64,06,790
వైఎస్సార్ బీమా	609	రూ.7,16,23,148
ఇన్‌పుట్ సబ్సిడీ	3,506	రూ.65,80, 361
వైఎస్సార్ వాహనమిత్ర	2,515	రూ.4,41,78,326
సున్నా వడ్డీ పంట రుణాలు	11,706	రూ. 2,29,83,663
జగనన్న చేదోడు	2,456	రూ.35,34,90,209
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	8,322	రూ.17,22,94,421
కోవిడ్ సహాయం	47,309	రూ.5,91,45,209
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	5,602	రూ.3,23,26,027
వైఎస్సార్ మత్స్యకార భరోసా	27	రూ.3,31,000
అగ్రిగోల్డ్	202	రూ.2,17,92,605
వైఎస్సార్ లా నేస్తం	1	రూ.60 ,000
వైఎస్సార్ కల్యాణమస్తు	225	రూ.8,89,336
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లు	78	రూ.1,43,500
జగనన్న తోడు	5,374	రూ.2,60,68,848
జగనన్న విద్యా కానుక	983	రూ.45,72,29,797
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	16,473	రూ.18,49,03 618
జగనన్న గోరుముద్ద	19,832	రూ.11,02,27,498
90 రోజుల్లో ఇళ్ల పట్టాలు	4,649	రూ.87,35,38620

కింతాడలో సర్వాంగ సుందరంగా సచివాలయం






కె.కోటపాడు 50 పడకల ఆస్పత్రిలో ఓపీ సేవల కోసం వచ్చిన రోగులు



నాగయ్యపేట రైతు భరోసా కేంద్రం



దేవరాపల్లి పీహెచ్‌సీ



మాడుగులలో నిర్మించిన పీఆర్ అతిథి గృహం



ఇది కాదా అభివృద్ధి..

రూ.31.64 కోట్లతో 78 సచివాలయాలు, రూ.18.38 కోట్లతో 78 ఆర్బీకేలు, రూ.14.13 కోట్లతో 68 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రూ.5.12 కోట్లతో 32 డిజిటల్ లైబ్రరీలు నిర్మించారు. రూ.56.70 లక్షలతో చేపట్టిన 32 పంచాయతీ రాజ్ బీటీ రోడ్లు పూర్తి కావస్తున్నాయి. రూ.47.32 కోట్లతో 476 సీసీ రోడ్లు, రూ.4.64 కోట్లతో 2 వంతెనలు, రూ.54 లక్షలతో 15 కల్వర్టులు నిర్మించారు. రూ.1.75 కోట్లతో 31 కమ్యూనిటీ హాల్స్, రూ.80.60 కోట్లతో 21 ఆర్‌అండ్‌బీ రోడ్లు, మాడుగులలో రూ.1.40 కోట్లతో పీఆర్ వసతి గృహం, రూ.1.20 కోట్లతో శీతల గిడ్డంగులు నిర్మించారు. జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా రూ.130.91 కోట్లతో 650 పనులు చేపట్టి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. మాడుగుల మండలంలో తాచేరు నదిపై రూ.3.40 కోట్లతో వంతెన నిర్మిస్తున్నారు.

రూ.12.14 కోట్లతో ఆస్పత్రుల నవీకరణ

నియోజకవర్గంలో రూ.12.14 కోట్లతో ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. కె.కోటపాడు సీహెచ్‌సీని రూ.5.20 కోట్లతో 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. మాడుగుల సీహెచ్‌సీ, కేజే పురం, కింతలి, దేవరాపల్లి, వేచలం, పెదగోగాడ, చీడికాడ పీహెచ్‌సీలను ఆధునికీకరించారు. దేవరాపల్లిలో రూ.1.70 కోట్లతో ప్రత్యేక ఆస్పత్రి భవన నిర్మాణం జరుగుతోంది. దాదాపుగా పనులు పూర్తవుతున్నాయి.

మాడుగులలో కోల్డ్ స్టోరేజీ గిడ్డంగులు





కేజేపురం నుంచి అప్పలరాజుపురం మీదుగా వేసిన పక్కారోడ్డు



ఆనందంగా ఉంది

ప్రజల కళ్లలో ఆనందమే ముఖ్యం. వారు సంతోషంగా ఉండాలి. అదే నా ధ్యేయం. ఐదేళ్లలో గరిష్ఠంగా చేయగలిగినంత అభివృద్ధి చేశాను. మాడుగుల నియోజకవర్గంలో ఏ గ్రామం వెళ్లినా హారతులు పడుతున్నారంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో చేసిన ప్రగతి పనులే కారణం. మారుమూల గ్రామాలు సైతం పక్కా రహదారులు, సచివాలయం, ఆర్బీకే, సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతంపై అవగాహన ఉన్న నాకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయించడంతో కొండబాటలుగా ఉన్న గిరి గ్రామాలన్నింటికీ కోట్లాది రూపాయలతో రోడ్లు వేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశాను. ఆదర్శ నియోజకవర్గంగా మార్పు తీసుకురావడం సంతృప్తినిచ్చింది. రానున్న కాలంలో మిగిలి ఉన్న పనులను సైతం ప్రజలు అడగకుండా నేనే స్వయంగా తెలుసుకుని పూర్తి చేస్తాను. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని బంగారు పల్లెగా మారుస్తాను. నన్ను నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలకు ఆజన్మాంతం అండగా ఉంటాను.

– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి

పేదలందరికీ ఇళ్లు

నియోజకవర్గంలో రూ.130 కోట్లతో ఇళ్లు మంజూరు చేశారు. ఇవి కాకుండా రూ.24.36 కోట్ల బ్యాంకు రుణాలు అందించారు. 96 జగనన్న లే అవుట్లతోపాటు 2,773 ఇళ్లు మంజూరు కాగా 617 పూర్తయ్యాయి. 2,156 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. సొంత స్థలాలకు సంబంధించి 5,333 జగనన్న ఇల్లు మంజూరు కాగా 1740 పూర్తయ్యాయి. 3,593 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. పీఎంఏవై–జీ కింద 1380 ఇళ్లు మంజూరు కాగా 156 ఇళ్లు పూర్తయ్యాయి. 1224 నిర్మాణంలో ఉన్నాయి.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

నియోజకవర్గంలో నాడు–నేడులో భాగంగా రెండు విడతల్లో 163 పాఠశాలలను రూ.60 కోట్లతో ఆధునికీకరించారు. తాగునీరుతో పాటు టాయిలెట్స్, బెంచీలు, ఫ్యాన్లు, డిజిటల్ బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా కనువిందు చేస్తున్నాయి. బ్యాగ్, పుస్తకాలు, షూ, టైలతో విద్యాకానుక అందించడంతో సర్కారు బడులకు ఆదరణ పెరిగింది.

మహిళా సాధికారత దిశగా సీఎం పాలన

మహిళా దినోత్సవంలో ఎంపీ సత్యవతి



మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల: రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని ఎంపీ బీవీ సత్యవతి తెలిపారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అన్నింటా మహిళలకే మొదటి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. శుక్రవారం అనకాపల్లి పట్టణంలోని గవరపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ సత్యవతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ 80 శాతం మహిళలే ముందుంటున్నారన్నారు. పోరాటాలతోనే మహిళా దినోత్సవం సాధించుకున్నామని, అదే స్ఫూర్తితో పురుషుల సహకారంతో ముందడుగు వేయాలన్నారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి అని అన్నారు. తనలాంటి అనేకమందికి చట్టసభల్లో ప్రజా ప్రతినిధులుగా అవకాశం కల్పించారన్నారు. ఒకప్పుడు ఆడపిల్ల పుడితే నేరంగా చూసే రోజులు పోయాయన్నారు. ప్రతి మహిళా విజయం వెనుక పురుషులు ఉంటారని వారికి తగిన గౌరవం ఇవ్వాలన్నారు. అనకాపల్లిలో ఎన్టీఆర్ గ్రౌండ్‌లో రూ.70 లక్షలతో మహిళా వసతి ప్రాంగణం నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 45 స్కూళ్లలో ప్లేస్కూల్ అప్‌డేట్‌కు రూ.36 లక్షలు మంజూరు చేశామన్నారు. రూ.22.5 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా ఆస్పత్రి ఎదురుగా క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి మాట్లాడుతూ మహిళలు ఎక్కువ అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికల నుంచి మహిళల వరకు రక్తహీనత లేకుండా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ప్రతి మహిళా బ్యాలెన్స్ డైట్ తీసుకోవాలన్నారు. నిర్భయ వంటి చట్టాలతో మహిళలకు పూర్తి రక్షణ ప్రభుత్వం కల్పించిందని మహిళా అడ్వకేట్ కుసుమ అన్నారు. సమాజంలో అమ్మకు ఇచ్చే గౌరవం ప్రతి మహిళ పట్ల ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అనురాధ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, కార్పొరేటర్లు పీలా లక్ష్మీసౌజన్య, కొణతాల నీలిమ, ఎంపీపీలు కలగ లక్ష్మి, గొర్లి సూరిబాబు, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, ఏఎస్పై మణికుమారి, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

మునగపాక: బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు ఎంఈవో వేణుగోపాలరావు శుక్రవారం తెలిపారు. ఇటీవల మునగపాక దళితవాడలో బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శివకోటి దుర్గాప్రసాద్‌పై కేసు నమోదైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విద్యా శాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేశామన్నారు. కేసు విచారణ పూర్తయ్యేంత వరకు ఇది అమలులో ఉంటుందన్నారు.

వైద్యాధికారి పోస్టు భర్తీకి చర్యలు

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ మానసిక వైద్యశాల పరిధిలో ఉన్న ఒపియాయిడ్ ప్రత్యామ్నాయ చికిత్స కేంద్రంలో ఓ వైద్యాధికారి పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తున్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వ మానసిక వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ కేవీ రామిరెడ్డి తెలిపారు.

ఆ రైల్లో అంతా మహిళలే..

ప్రత్యేక మహిళా రైలును నడిపిన వాల్తేర్ డివిజన్



మహిళా సిబ్బందితో బయల్దేరుతున్న ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఈకార్వో ప్రతినిధులు

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈస్ట్‌కోస్ట్‌రైల్వే వాల్తేర్ డివిజన్ అందరూ మహిళా సిబ్బందితో ప్రత్యేక మహిళా రైలును నడిపి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాల్తేర్ డివిజన్ విశాఖపట్నం–భవానిపట్న (08504) పాసింజర్ స్పెషల్ రైలును పూర్తి మహిళా సిబ్బందితో నడిపింది. శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ ఈ ప్రత్యేక రైలుకు ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్‌లో మహిళలు రైళ్ల నిర్వహణ, ఆపరేషన్స్, కమర్షియల్ వంటి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారనడానికి ఈ ప్రత్యేక రైలు నిదర్శనమని ఆమె తెలిపారు. ఈ ప్రత్యేక రైలు స్టేషన్ మేనేజర్ అరుణశ్రీ నేతృత్వంలో ఝాన్సీరాణి లోకోపైలట్‌గా, సాధనా కుమారి సహ పైలట్‌గా, శ్రీరమ్య ట్రైన్ మేనేజర్‌గా వ్యవహరించారు. డివిజనల్ రైల్వే మేనేజర్‌చే ఉత్తమ రైల్ సేవా పురస్కార్ అవార్డు అందుకున్న రాణి ఝాన్సీ గ్రూప్ ఈ రైలుకు చెకింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్‌లు మధుస్మిత సాహూ, కవితా గుప్తా, జాయింట్ సెక్రటరీ సంయుక్త ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో శివుడు



ఏయూక్యాంపస్: మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు విభిన్న రూపాల్లో నిర్వహించుకుంటారు. నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తన వైవిధ్యమైన కళా ప్రతిభతో పరమేశ్వరుని చిత్రానికి రూపమిచ్చారు. చిరుధాన్యాలను వినియోగించి మూడు అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు కలిగిన పరమేశ్వరుని చిత్రాన్ని దాదాపు పది రోజులు శ్రమించి తీర్చిదిద్దారు.

సముద్రంలో మునిగి యువకుడి మృతి



సముద్రంలో మునిగి మృతి చెందిన మనీష్

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో సముద్రంలో మునిగి ఓ యువకుడు మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. పాయకరావుపేటకు చెందిన నూకాల మనీష్ (29) విహరించేందుకు శుక్రవారం తీరానికి వచ్చాడని తెలిపారు. బ్రిడ్జి సమీపంలో ఆనుకుని ఉన్న రాళ్ల వద్ద నడుస్తుండగా కాలుజారి సముద్రంలో పడిపోయినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆది దేవాయ నమః అగ్ని నేత్రాయ నమః

- ఘనంగా శివరాత్రి ఉత్సవాలు
- మార్మోగిన పంచాక్షరి మంత్రం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



నాతవరం మండలం బీబీ అగ్రహారం శివాలయంలో కుంకుమపూజలు చేస్తున్న భక్తులు

నమస్తే అస్తు భగవన్ విశ్వేశ్వరాయ
మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాన్తకాయ
త్రికాగ్నికాలాయ కాలాగ్నిరుద్రాయ నీలకం
ఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ
సదాశివాయ శ్రీమన్మహాదేవయ నమః...

అంటూ పరవశించి పోతూ భక్తులు ఆది దేవునికి అభిషేకాలు చేశారు...మా రేడు నీవంటూ మారేడు పత్రితో పూజలు జరిపారు... సమస్త శుభాలను ప్రసాదించే మంగళకారుడికి మంగళనీరాజనాలు సమర్పించారు... జంగమయ్యా జాగు చేయక మము కరుణించవయ్య అంటూ గంటానాథాలతో వేడుకొన్నారు... ఉపవాస, జాగరణలు చేసి ఉమాశంకరునికి ఉత్సవాలు జరిపారు... మహా శివరాత్రి సందర్భంగా గ్రామగ్రామాన ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.. ఆలయాలకు భక్తులు పోటెత్తారు...

కల్యాణపులోవకు పోటెత్తిన భక్తులు

రావికమతం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉత్తరాంధ్రలోనే ప్రముఖ శైవక్షేత్రమైన కల్యాణపులోవ తిరునాళ్లకు భక్తులు, యాత్రికులు శుక్రవారం పోటెత్తారు. హరహరమహాదేవ శంభోశంకర నామస్మరణతో ఈప్రాంతం హోరెత్తిపోయింది. స్నానాలరేవు, ఆలయ పరిసరాలు, ప్రత్యేకంగా వేసిన షామియానాలు కిక్కిరిశాయి. 90 వేల మందికిపైగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. ఎండోమెంటు ఈవో కిరణ్మయి, కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక ఏర్పాట్లు

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద నీడనిచ్చేందుకు భారీ చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వేలాది మందికి ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీపీ పైల రాజు,జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, ప్రజాప్రతినిధులు,పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు సహాయ సహకారాలందించారు.గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో లక్షల వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. స్నానాల రేవులో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తగినన్ని తాత్కాలిక దడులను ఏర్పాటు చేశారు. గజఈతగాళ్లను ఏర్పాటు చేశారు. పోలీసు, ఫైర్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.

మజ్జిగ, లస్సీ పంపిణీ

విశాఖ డెయిరీ,జిల్లా కేంద్ర సహకార బ్యాంకు,పలు గ్రామాల సర్పంచ్‌లు ఆధ్వర్యంలో ప్రధాన ఆలయం వద్ద మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు. వాసవి క్లబ్,వాసవి వనిత క్లబ్ సభ్యులు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భక్తులకు ఉచితంగా మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.

కల్యాణ పోతురాజు బాబును దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి కల్యాణపులోవలో కల్యాణపోతురాజుబాబును శుక్రవారం దర్శించుకున్నారు. మూడురోజుల పాటు ఇక్కడ తిరునాళ్లు జరుగుతున్న సంగతి తెలిసిందే. శుక్రవారం ఆమె అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి అధికారులకు ఆదేశించారు. ఆమెవెంటఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు,చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌మురళీకృష్ణ,ఈవో కిరణ్మయి ఉన్నారు.

రాంబిల్లి: ప్రముఖ శైవక్షేత్రమైన పంచదార్ల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలుప్రాంతాల నుంచి భక్తులు పంచదార్ల పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. తొలుత పవిత్రమైన ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు జరిపించారు. ఆకాశధార వద్ద పుణ్యస్నానా లు ఆచరించేందుకు, ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కాశీ విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

ఉత్తరవాహినిలో భక్తుల కోలాహలం

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని బలిఘట్టం ఉత్తరవాహిని నదిఒడ్డున త్రిశూల పర్వతంపై వేంచియున్న శ్రీ బ్రహ్మలింగేశ్వరస్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం స్వామికి పూజలు చేశారు. లింగోద్భవ సమయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించారు. భారీ ఎత్తున భక్తులు తరలిరావడంతో ఉత్తరవాహిని ప్రాంతం కోలాహలంగా మారింది. పితృదేవతలను మననం చేస్తూ బుడగజంగాల చేసిన శంఖారావాలతో ఈ ప్రాంతం మార్మోగింది. పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కోరికలను గురుదేవుల చెవిలో చెబుతే నెరవేరుతాయని భక్తులు విశ్వాసం. గురుదేవుల చెవిలో కోరికలు చెప్పేందుకు భక్తులు పోటీపడ్డారు. శ్రీసత్యనారాయణస్వామి వారిని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చినభక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేములపూడి పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారు. భగవాన్ శ్రీసత్యసాయి సేవసమితి, వివిధ ధార్మిక సంఘాలు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పట్టణ సీఐ కాంతికుమార్ పటిష్ట చర్యలు తీసుకున్నారు.



పంచదార్ల పుణ్యక్షేత్రంలో ఉమా ధర్మలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



పాకలపాడు గురుదేవుల రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు



ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు



భారీ అన్నదానం కౌంటర్‌లో సహకారమందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఉత్తర వాహినిలో భక్తుల పుణ్యస్నానాలు



స్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



మజ్జిగ, లస్సీ పంపిణీ చేస్తున్న దృశ్యం



స్వామివారిని దర్శించుకుంటున్న సుధారాణి



అనకాపల్లిలోని సాధువుల గుడిలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తురాలు



స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో పూలతో అలంకరించిన నందీశ్వరుడు

వేడుకగా వడ్డాది వెంకన్న కల్యాణానికి పెళ్లిరాట



ఆలయ ముఖ ద్వారం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవానికి శుక్రవారం పెళ్లిరాట వేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త దొండా కన్నబాబు, దేవస్థానం ఈవో శర్మ, గ్రామ పెద్దలు, పేరంటాల సమక్షంలో డప్పులు, వాయిద్యాలు, సన్నాయి, మేళతాళాలు వేద పండితుల మధ్యన అంగరంగ వైభవంగా ఈ తంతు నిర్వహించారు. ఏటా మహా శివరాత్రి తర్వాత ఐదు రోజుల పాటు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ఈ నెల 20న అర్ధరాత్రి స్వామివారి కల్యాణానికి అంకురార్పణ, దొంగ పెండ్లి నిర్వహించి 25వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త, ఈవో తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దొండా సన్యాసిరావు, శ్రీరామూర్తి, కుబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్, పొలిమేర కృష్ణ, సయ్యపురెడ్డి కొండబాబు, రమేష్, చంద్రరావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని పినారపాలెంకు చెందిన గొల్లి పూర్ణ చంద్రికసాయి(25) అనే వివాహిత మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆస్తుల తగదాల కారణంగా కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు జరగడంతో మనస్తాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూపాయికే ఇల్లు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- టిడ్కో గృహాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు తాళాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీలో పేదలకు రూపాయికే ఇల్లు ఇచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బలిఘట్టంలో శనివారం టిడ్కో గృహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం ఇచ్చిన మాట ప్రకారం టిడ్కోగృహాలను అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టర్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు 2019లోనే గృహాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 300 చదరపు గజాల గృహాలను ఒక్కటి కూడా నిర్మించలేదని చెప్పారు. 384 గృహాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. వీటిలో 352 మందికి గృహాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగిలినవి కొద్ది రోజుల్లో ఇస్తామన్నారు. 365 చదరపు గజాల 336 గృహాలు కాగా, కేవలం 180 మాత్రమే శ్లాబ్ వేసివదిలేశారన్నారు. 430 చదరపు గజాలగృహాలు 1104 కాగా, 750కి మాత్రమే శ్లాబ్ వేశారన్నారు. ప్రస్తుతం అందిస్తున్న ఉచిత గృహాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తి చేశామన్నారు. టిడ్కో గృహాలకు రూ.128 కోట్ల ఖర్చు చేయాల్సి ఉండగా టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.36 కోట్ల ఖర్చు చేసిందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు తాళాలు అందచేసి, గృహప్రవేశాలను చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టిడ్కో ఎస్ఈ డి.ఎస్.మూర్తి, ఈఈ సుధాకర్, కమిషనర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ముసుగులో కేటుగాళ్లు

- రూ.3 కోట్లకు ముంచేశారు
- టూ టౌన్ ఎస్ఐగా అవతారమెత్తిన సస్పెండైన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్
- రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసం
- ఒక్కొక్కరి నుంచి రూ.12 నుంచి రూ.15 లక్షల వసూలు
- ముగ్గుర్ని పెళ్లాడిన ఘనుడు
- ఆమెకూ పోలీస్ డ్రెస్ వేసి యువతకు వల
- డమ్మీ పిస్టల్‌తో బెదిరించి పరారైన నిందితులు
- మిస్సింగ్ కేసు దర్యాప్తులో వ్యవహారం బట్టబయలు?
- పోలీసుల అదుపులో రమేష్, ప్రవీణ

విశాఖ సిటీ: ఒక మిస్సింగ్ కేసు.. పెద్ద మిస్టరీని బట్టబయలు చేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను రూ.3 కోట్లకు ముంచేసిన ఘరానా నకిలీ పోలీసు వ్యవహారమిది. ఎస్ఐగా అవతారమెత్తి.. తన చేతిలో మోసపోయిన యువతినే బుట్టలో వేసుకొని.. ఆమెతో కలిసి అనేక మందిని దోచుకున్న సస్పెన్షన్‌కు గురైన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ హనుమంతు రమేష్ (47) వ్యవహారం ఇపుడు నగరంలో సంచలనం రేకెత్తిస్తోంది. రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.12 నుంచి రూ.15 లక్షలు వసూలు చేసిన దగ్గర నుంచి.. నకిలీ రైల్వే వెబ్‌సైట్ తయారీ.. హాల్ టికెట్ల జారీ.. విజయవాడలో ఒక హోటల్‌లో ఉత్తుత్తి ప్రవేశ పరీక్ష నిర్వహణ.. హైదరాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలో ఇంటర్వ్యూల పేరుతో హడావుడి.. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ.. ఇలా అనేక మంది నిరుద్యోగులను నిలువు దోపిడీ చేసిన ఆ రహస్య దంపతుల తెలివితేటలకు పోలీసులు సైతం విస్తుపోయారు. వివరాల్లోకి వెళితే..

విధుల్లో నిర్లక్ష్యంతో సస్పెన్షన్

శ్రీకాకుళం జిల్లా మొళియాపుట్టు ప్రాంతానికి చెందిన హనుమంతు రమేష్ సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పనిచేస్తున్నాడు. 2022 సంవత్సరంలో జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ అయినప్పటికీ అతడు విధుల్లో చేరలేదు. దీంతో దీర్ఘకాలం సెలవు తీసుకోవడంతో సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు అతడ్ని సస్పెండ్ చేశారు. ప్రస్తుతం రమేష్ పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో అడవివరం ప్రాంతంలో ఆర్ఆర్ టవర్స్‌లో నివాసముంటున్నాడు.

ఎస్ఐగా అవతారమెత్తి..

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా సస్పెన్షన్‌కు గురైన రమేష్ విశాఖ టూటౌన్ ఎస్ఐగా అవతారమెత్తాడు. తన నివాస ప్రాంతంలోనే కాకుండా పెందుర్తిలో కొన్ని సామాజిక వర్గాల పెద్దలను పరిచయం చేసుకున్నాడు. రైల్వే శాఖలో కొంత మంది ఉన్నతాధికారులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని అందరికీ చెప్పుకొచ్చాడు. రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో అనేక మంది నిరుద్యోగులు రమేష్ మాటలు విశ్వసించి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు సమర్పించుకున్నారు.

యువతులకు వల..

రమేష్ యువతులకు వల వేయడంలో సిద్ధహస్తుడు. ముందు ఒక మహిళను వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఆమె అక్కపై కన్నేసి ఆమెను కూడా పెళ్లాడాడు. ఆ ఇద్దరితోనే ఆగిపోలేదు. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ అనే యువతి నుంచి కూడా రమేష్ రూ.15 లక్షల వరకు డబ్బు తీసుకొని మోసం చేశాడు. ఉద్యోగం రాకపోయే సరికి



ప్రవీణతో రమేష్ (ఫైల్)

ప్రవీణ తండ్రి రమేష్‌ను గట్టిగా నిలదీశాడు. దీంతో అతడు తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేశాడు. అయితే ప్రవీణను మాత్రం సింహాచలంలో రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. రమేష్‌తో కలిసి ప్రవీణ కూడా పోలీస్ అని చెప్పుకుంటూ నిరుద్యోగులకు వల వేసింది.

డమ్మీ పిస్టల్‌తో బెదిరించి

రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో అభ్యర్థులు రమేష్‌ను నిలదీయడం ప్రారంభించారు. ఒకసారి అత డి ఇంటికి వెళ్లి వాగ్వాదానికి దిగారు. తమకు డబ్బులు ఇవ్వకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించా రు. దీంతో రమేష్ తన వద్ద ఉన్న డమ్మీ మెటల్ పిస్టల్‌ను చూపించి వారిని బెదిరించాడు. అనంతరం విశాఖ నుంచి ప్రవీణతో కలిసి పరారయ్యాడు.

మిస్సింగ్ ఫిర్యాదుతో వెలుగులోకి?

తన భర్త కనిపించడం లేదని రమేష్ భార్య ఈ ఏడాది జనవరి 24వ తేదీన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో అనేక విస్తుపోయే వాస్తవాలు పోలీసుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. వారికి అందిన సమాచారం ప్రకారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రమేష్, ప్రవీణలపై నెల రోజుల పాటు నిఘా పెట్టారు. సాంకేతికత సహాయంతో వారు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఇదే సమయంలో కొంత మంది బాధితులు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదులు ఆధారంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు హైదరాబాద్‌కు వెళ్లి రమేష్, ప్రవీణలను అదుపులోకి తీసుకున్నారు.

రహస్యంగా విచారణ..

నిరుద్యోగులను నిలువునా ముంచిన ఇద్దరినీ పోలీస్ ఉన్నతాధికారులు రహస్యంగా విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉండడంతో వివరాలు వెల్లడించడం లేదు. అయితే ఇప్పటికే కీలకమైన ఆధారాలు సేకరించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. త్వరలోనే వీరిని అరెస్టు చూపించే అవకాశాలు ఉన్నాయి.

నకిలీ వెబ్‌సైట్.. ఉత్తుత్తి పరీక్ష

నిరుద్యోగులను నుంచి రూ.కోట్లు కాజేసేందుకు రమేష్, ప్రవీణ అడుగడుగునా మోసాలకు తెరతీశారు. అభ్యర్థులను నమ్మించేందుకు వీరు ఏకంగా నకిలీ రైల్వే వెబ్‌సైట్‌ను రూపొందించారు. దాని ద్వారా అభ్యర్థులకు మెయిల్స్ ద్వారా ఉద్యోగ సమాచారాన్ని పంపించే వారు. నకిలీ హాల్ టికెట్లు జారీ చేశారు. విజయవాడలో ఒక హోటల్‌లో ఉత్తుత్తి పరీక్ష సైతం నిర్వహించారు. అంతటితో ఆగకుండా కొద్ది రోజులకు ఇంటర్వ్యూ ఉందని హైదరాబాద్‌లో డీఆర్ఎం కార్యాలయానికి రావాలని మెసేజ్‌లు పంపించారు. అభ్యర్థులు అక్కడికి వెళ్లగా రమేష్ వారిని రిసీవ్ చేసుకున్నాడు. ఉన్నతాధికారులతో మాట్లాడి వస్తానని చెప్పి కొంత సేపు కార్యాలయంలో తిరిగి వచ్చాడు. ప్రస్తుతం అధికారులు బిజీగా ఉన్నారని మరోసారి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పి అభ్యర్థులను అక్కడి నుంచి పంపించేశాడు. వీరికి ఉద్యోగాలు వచ్చేశాయని నకిలీ నియామక పత్రాలు చూపిస్తూ మరికొంత మంది నుంచి కూడా డబ్బులు వసూలు చేశాడు.

క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



రథం ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు, మన్మథరావు

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు రథాన్ని కార్పెంటర్ సంఘం పట్టణ అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు ప్రారంభించారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి రోజు స్వామివారి రథం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. కామాక్షి కార్పెంటర్ సంఘం ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి మునాసల రామకృష్ణ, వివిధ కార్పెంటర్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉరుసు మహోత్సవం



చింతలపాలెంలోని హజరత్ కాలేషా బాబా దర్గా

కశింకోట : మండలంలోని చింతలపాలెంలో వెలసిన హజరత్ కాలేషా బాబా దర్గా 72వ ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) శనివారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జెండా ప్రతిష్టాపన, సాయంత్రం చందనోత్సవ ఊరేగింపు, ఫాతిహా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌గౌస్ తెలిపారు.

పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ

అనకాపల్లి : పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న స్థానిక గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దేవాలయాల ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి వేసవిని దృష్టిలో పెట్టుకుని పక్షులకు తిండి గింజలు (వరి కుంచులు), అవి నీరు తాగే మట్టి పాత్రలు, పక్షుల గూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది వేసవిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట : మండలంలోని మోసయ్యపేటలో 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వినోద్‌బాబు తెలిపారు. ఈ ఘటనలో దుడ్డేటి చిన రమణను అరెస్టు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,879 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,780	4,150
మొదటి రకం	3,600	4,280
రెండో రకం	3,410	3,770
మూడోరకం	3,300	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:రాజా
గామి	:సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	:సత్యనారాయణస్క్రీన్-2
రాజుగారి అమ్మాయి, నాయుడుగారి అబ్బాయి	: షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్	:వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	:శ్రీసత్య
భీమా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 86 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-45 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

శివ పూజలతో.. శోభాయమానం

శివరాత్రి రోజునే శివుడు లింగరూపంలో ఉద్భవించాడని పురాణాల వల్ల తెలుస్తోంది. అమితమైన దైవశక్తి గురించి తెలిపేందుకే ఈ అవతారం అంటారు రుషులు. అనంతమైన లింగాకారంలో ఉన్న శివుడు తాను సర్వవ్యాపితమని నిరూపించాడు. తనపై మనసు నిలిపి ధ్యానిస్తే ఎక్కడైనా తాను కనిపిస్తానని చెప్పేందుకు ఆయన లింగాకారం ధరించినట్లు చెబుతారు. శివరాత్రి రోజు అర్ధరాత్రి సమయంలోనే లింగోద్భవం జరిగింది కనుక ఆ సమయంలో శివుని ఆరాధిస్తే పుణ్యఫలం దక్కుతుంది.

- శివరాత్రి వేడుకలతో ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక ఝురి



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



కశింకోట శివాలయంలో శివునికి అభిషేకాలు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



కశింకోట శివాలయంలో సర్వమంగళాంబకు పూజలు చేస్తున్న మహిళలు



కశింకోట శివాలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



ఏఎస్‌పేటలో సాంబ శివలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భరత్‌కుమార్ దంపతులు



హోమంలో ఆలయ కమిటీ సభ్యులు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న సునీత, జానకీరామరాజు దంపతులు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సిద్ధి లింగేశ్వరస్వామి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

అనకాపల్లి : మహా శివరాత్రి పర్వదినాన ఊరూవాడా శివనామ స్మరణతో మార్మోగాయి. హరహర మహా దేవ.. శంభో శంకరా అంటూ భక్తులు పరమ శివుడిని ఎలుగెత్తి ప్రార్థించారు. పాలు, నెయ్యి, విభూది, పంచదార, పలు రకాల పూలతో స్వామివారిని పూజించారు. అర్ధరాత్రి సమీపించిన తరుణంలో మహాలింగోద్భవ సమయాన భక్తుల నోట శివపంచాక్షరీ మంత్ర ఘోష మిన్నంటింది. మహాన్యసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతభిషేకాలు, క్షీరాభిషేకాలతో శివాలయాలు శోభాయమానమయ్యాయి. రాత్రంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో భక్తులు జాగరణ చేసి, స్వామి సేవలో పులకించిపోయారు. అనకాపల్లి పట్టణం, మండలంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచే ఆలయాలకు భక్తులు రాక మొదలైంది. వేల్పులవీధి శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, శారదా నది ఒడ్డున గాంధీనగరంలో ఉమారామలింగేశ్వరస్వామి, అరటిపళ్లు, కొబ్బరి కాయల మార్కెట్ వద్ద సాధువుల గుడి, గవరపాలెం కోటవీధిలో భోగలింగేశ్వరస్వామి, చిన్నవీధిలో చౌడేశ్వరీ దేవాలయం, పార్కుసెంటర్ గౌరీపంచాయతీ దేవాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకాలు, దీపారాధన, రాత్రి 10 గంటల నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో శివలింగానికి అభిషేకాలు జరిగాయి. ఆయా దేవాలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, నుదురుపాటి తాతాజీ, తాడికొండ కామేశ్వరరావు, బీశెట్టి జగన్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- 83వ వార్డు లక్ష్మీదేవిపేటలో థాట్సాఫ్ లివింగ్ ఆశ్రమంలో పడాల అప్పారావు ఆధ్వర్యంలో 11 అడుగుల శివలింగానికి క్షీరపంచామృతాలు, పండ్ల రసాలు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. .
- మండలంలో శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, గొలగాం, ఎన్టీఆర్ కాలనీ, మారేడుపూడి, తుమ్మపాల, సీతానగరం, వెంకుపాలెం, కుంచంగి, కూండ్రం, మామిడిపాలెం, బవులవాడ, రేబాక, శంకరం, కేఎన్‌ఆర్ పేట, కొత్తూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు..

కశింకోట : మండల గ్రామాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఏఎస్ పేటలో వెలసిన స్వయం భూ సాంబశివలింగేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మోహెర్ నివేదిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఇక్కడ ఈసారి నిర్వహించిన గిరి ప్రదక్షిణలో వారు పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, పార్టీ నాయకుడు మలసాల కుమార్‌రాజా, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయం (శివాలయం)లో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. సర్వమంగళాంబకు రాహుకాల పూజలను మహిళలు సామూహికంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి లింగదీపార్చన నిర్వహించారు. అనంతరం నేపాల్ నుంచి తెచ్చిన వేలాది రుద్రాక్షలతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ రుద్రాభిషేకం నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేశారు. గవరపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. భక్తులు జలాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక కస్పావీధిలో వెలసిన సాంబశివుని ఆలయంలో ఉదయం నుంచి అర్చకుడు వెయ్యి దళముల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. స్వామిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అలాగే స్థానిక గవరపేటలోని విశ్వబ్రాహ్మణ వీధిలో వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు చేసి గ్రామంలో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. పేరంటాలపాలెం శివాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, సోమవరం, చింతలపాలెం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాలు, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, తాళ్లపాలెం సంతలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలో బసవేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ మండపంలో నాగేశ్వర స్వామికి అభిషేకాలు, గోపూజ ఆలయ అర్చకులు డి.శ్యాంచైతన్య శర్మ నిర్వహించారు. ఆలయంలో పంచాయతన పూర్వక గణపతి హోమం, సౌర, అంబిక, విష్ణు, రుద్ర హోమాలు చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాద వితరణ ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



కశింకోటలో వైస్ ఎంపీపీ జ్యోతిని సన్మానిస్తున్న మహిళలు



ఎంపీ సత్యవతికి చీర అందజేస్తున్న భరత్‌కుమార్ సతీమణి నివేదిత



సబ్ జైల్లో మహిళలకు గాంధీజీ జీవిత చరిత్ర పుస్తకాలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు



ఆర్టీసీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలతో జిల్లా అధికారి పద్మావతి

కశింకోట : స్థానిక వడ్డి వీధిలో శుక్రవారం రాత్రి జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ వార్డు సభ్యురాలు బొడ్డేడ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగా భవానీలను సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు బొడ్డేడ రూపవతి, వేగి జయ, పెంటకోట నాగమణి, తగరంపూడి నూకరత్నం, యల్లపు కుమారి తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి మహిళలే వెన్నెముక..

అనకాపల్లి : స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంపీ బీవీ సత్యవతి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. దేశానికి మహిళలు వెన్నెముక లాంటివారని, ప్రతి పురుషుని ఎదుగుదలకు మహిళ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత కల్పించడమే మంచి పదవులు ఇచ్చిన ఘనత ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత ఎంపీ బీవీ సత్యవతితో పాటు మరో 100 మంది మహిళలను సత్కరించారు. కార్పొరేటర్లు మందపాటి సునీత, జాజుల ప్రసన్నలక్ష్మి, పీలా లక్ష్మీ సౌజన్య, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏపీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లోని ఉత్తమ మహిళా కండక్టర్లను జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.సుజాత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- సబ్ జైల్లో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జైల్లో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. జైల్ సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో మహిళలను దేవతా మూర్తులుగా పూజిస్తారని, ప్రపంచ వ్యాప్తంగా మహిళలు ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధించారన్నారు. అనంతరం మహిళా ఖైదీలకు మహాత్మాగాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- ఉడ్‌పేట హ్యాపీకి డ్ స్కూల్లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తల్లులకు పిల్లలు పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, మహిళలు పాల్గొన్నారు.
- మండలంలో సత్యనారాయణస్వామి కొండ మామిడి తోటల వద్ద సంచార వర్గాలకు చెందిన మహిళలకు ఏపీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాధికార సాధన వేదిక రాష్ట్ర కన్వీనర్ సూరికొండ మాణిక్యాలరావు చీరలు పంపిణీ చేశారు.

తాళ్లపాలెంలో..

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధి పథకం కూలీలకు టిఫిన్ బాక్స్‌లు, మజ్జిగ ప్యాకెట్లను ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవానీ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పాల సంఘం అధ్యక్షుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



హ్యాపీ కిడ్స్ స్కూల్లో తల్లుల కాళ్లకు నమస్కరిస్తున్న చిన్నారులు



సత్యనారాయణపురంలో మహిళలకు చీరలు అందజేస్తున్న సూరికొండ మాణిక్యాలరావు



తాళ్లపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవానీ

ఆయుర్వేద వైద్యంపై పెరుగుతున్న అవగాహన



రోగులతో మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యురాలు లావణ్య



కన్నూరుపాలెంలో నిర్వహిస్తున్న ఉచిత ఆయుర్వేదిక్ వైద్య శిబిరం

అనకాపల్లి : ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన పెరుగుతుందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆయుర్వేదంపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల సమయంలో ఆయుర్వేదంపై రోగులకు ఆసక్తి పెరిగిందన్నారు. ఇంగ్లీష్ మందులు రోగాన్ని త్వరితగతిన నయం చేస్తే, ఆయుర్వేదం నెమ్మదిగా పని చేస్తుందని ఆమె పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, తమిళనాడు నుంచి ప్రభుత్వం ఈ మందులు పంపిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. బీపీ, సుగర్, మూలవ్యాధి, కీళ్లనొప్పులు, ఆయాసం వంటి వ్యాధులతో పాటు 100 రకాల మందులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 121 మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో..

కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం శివాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 67 మందికి సేవలందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష రోగులను పరీక్షించి ఉచితంగా ఆయుర్వేదిక్ మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు, ఆయుర్వేదిక్ వైద్యం పట్ల అవగాహన కలిగించారు. ఆయుర్వేదం భారతీయ వైద్యమని, దీనిలో దాదాపు అన్ని రకాల రుగ్మతలకు మందులు ఉన్నాయన్నారు. స్థానిక ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను గౌరవించుకోవడం మన విధి



ఉత్తమ ఉపాధ్యాయుడు దాడి కాళిదాసును సత్కరిస్తున్న అతిథులు

కశింకోట : ఉపాధ్యాయులను గౌరవించుకోవలసిన ఆవశ్యకత ఉందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ద్వారపురెడ్డి నూకరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన దాడి కాళిదాసును సత్కరించారు. అనంతరం 12 మంది ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముందుగా ద్వారపురెడ్డి నూకరాజు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం వ్యవస్థాపకుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, బీజేపీ నాయకులు ఎంఎం నాయుడు, శిష్టి అప్పారావు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, ట్రస్టు సభ్యులు జనపరెడ్డి హరనాథ్, వైఏ రాజు, గుమ్మాల శ్రీనివాసబాబు, కె.వి. రమేష్, ద్వారపురెడ్డి రాంబాబు, ద్వారపురెడ్డి నూకేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి చెక్కును బాధితులకు అందిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి లక్ష రూపాయల చెక్కును జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు శుక్రవారం పెంటకోటలో అందజేశారు. మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యమ్మపేట గ్రామానికి చెందిన రాయుడు నరసింగరావు కుమారుడు తరుణ్ ఏసుదుర్గ కుమార్ చిన్నతనం నుంచి ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. పిసినికాడలో నిర్వహించిన సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గురువారం ఏసుదుర్గ కుమార్ తల్లిదండ్రులు కలిసి తమ కుమారుడిని పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పందించి ఆర్థికసాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వెంటనే సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. ఆ చెక్కును రాయుడు నరసింగరావు దంపతులకు శుక్రవారం చిక్కాల రామారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పన్నీరు పాపారావు, నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, నీలాపు బాలకృష్ణారెడ్డి, యజ్జల సత్యనారాయణ, పల్లేల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



అనకాపల్లి : స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారిని మహాశివరాత్రి, శుక్రవారాన్ని పురస్కరించుకుని బోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. వ్యాపారవేత్త కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, వ్యస్థాపకులు పి.వి.రమణ, కమిటీ సభ్యులు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కొణతాల మురళీకృష్ణ, పాలిమేర శ్రీను, కాండ్రేగుల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో దివ్యాంగుడు మృతి

అనకాపల్లి : అనారోగ్యంతో దివ్యాంగుడు స్థానిక నెహ్రూచౌక్ బస్‌షెల్టర్ వద్ద శుక్రవారం మృతి చెందినట్లు పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు కశింకోట మండలం అడ్డాం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకట సూర్యనారాయణ (46) దివ్యాంగుల పింఛన్ తీసుకుని అడ్డాం నుంచి పద్మానాభం వెళ్తుండగా బస్‌షెల్టర్‌లో శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడి భార్య కృష్ణవేణి పద్మనాభంలో అమ్మగారి ఇంటి వద్ద ఉంటుందని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.